

ఓట్ల లెక్కింపు కేంద్రంలో సీసీ పుటేజ్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

# ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

- జగిత్యాల కలెక్టర్ యాస్మిన్ భాషా

జగిత్యాల, డిసెంబర్ 2: జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాల శాసనసభ ఓట్ల లెక్కింపు ఆదివారం జరగనుండగా వీఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తయ్యాయని ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. సంబంధిత అధికార యంత్రాంగం అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని తెలిపారు. ఈవీఎం లెక్కింపు కేంద్రమైన వీఆర్‌కే ఇంజనీరింగ్ కళాశాలలో పూర్తి స్థాయిలో బందోబస్తు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్‌ను, అత్యవసర సర్వీసుల వారి ఓట్లను లెక్కిస్తారని, జగిత్యాల నియోజకవర్గంలో 1,413, కోరుట్లలో 1,121, ధర్మపురిలో 807 పోస్టల్ బ్యాలెట్లు నమోదయ్యాయని తెలిపారు. అత్యవసర సర్వీసులకు సంబంధించిన ఓట్లు జగిత్యాలలో 23, ధర్మపురిలో 9 పోలయ్యాయని, వృద్ధులు, దివ్యాంగులకు సంబంధించిన ఓట్లు 1,121 ఓట్లు పోలయ్యాయని తెలిపారు. పోస్టల్, అత్యవసర విభాగాల ఓట్ల లెక్కింపు అనంతరం ఈవీఎంల ఓట్లు లెక్కింపు ప్రారంభిస్తారని తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి వేర్వేరుగా లెక్కింపు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒక్కో కేం ద్రంలో 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. జగిత్యాల నియోజకవర్గ ఓట్ల లెక్కింపు 19రౌండ్లలో పూర్తవుతుందన్నారు.



జగిత్యాల వీఆర్‌కే కళాశాలలో ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాటు చేసిన టేబుళ్లు

కోరుట్ల నియోజకవర్గ పరిధిలో పోలైన ఓట్లను 19 రౌండ్లలో లెక్కిస్తారు. ధర్మపురి నియోజకవర్గ ఓట్ల లెక్కింపు 20 రౌండ్లలో జరుగుతుందన్నారు. ప్రతి నియోజకవర్గానికి 25 మంది మైక్రో అబ్జర్వర్లు, 25 మంది సూపర్‌వైజర్లు, 25 మంది సహాయకులు, 150 మంది సిబ్బంది ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో విధులకు నియమించామని పేర్కొన్నారు. అలాగే ప్రతి నియోజకవర్గానికి పోస్టల్ బ్యాలెట్లు లెక్కించడానికి 3 టేబుళ్లను ఏర్పాటు చేయడంతో పాటుగా టీటీపీబీఎస్ ఒకటి చొప్పున ఏర్పాటు చేశామని తెలిపారు. అంతేకాకుండా ఎన్నికల పరిశీలకులు పోటీ చేసిన అభ్యర్థుల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల భద్రతను కట్టుదిట్టంగా భద్రపరచామని, కౌంటింగ్‌కు సంబంధించి అవసరమైన అన్ని సూచనలు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తెలిపారు.

# కౌంటింగ్ కేంద్రంలో మూడంచెల భద్రత

- రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు
- ఎస్పీ అఖిల్ మహాజన్
- బద్దెనపల్లిలో కౌంటింగ్ కేంద్రంలో భద్రత ఏర్పాట్ల పరిశీలన

సిరిసిల్ల రూరల్, డిసెంబర్ 2: అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో కౌంటింగ్ కేంద్రమైన తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి బాలికల గురుకుల పాఠశాలలో మూడంచెల విధానంలో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఈమేరకు శనివారం కౌంటింగ్ కేంద్రమైన బద్దెనపల్లిలోని బాలికల గురుకుల పాఠశాల, పరిసరాలలో భద్రతా చర్యలను పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కేంద్ర, రాష్ట్ర బలగాలు, ఆర్మ్‌డ్ రిజర్వ్ బలగాలు, స్థానిక పోలీసు బలగాలతో మూడంచెలా విధానంలో పటిష్ఠ భద్రత చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. సిరిసిల్ల, వేములవాడ నియోజవర్గాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు చేపట్టనున్న నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో పరిశీలించి, భద్రతాపరంగా తీసుకోవలసిన జాగ్రత్తలను సూచించారు. కౌంటింగ్ కేంద్రంతో పాటు జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఈనెల 3 నుంచి 4వ తేదీ ఉదయం 6గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు, ఎన్నికల ప్రవర్తనా నియామవళిని తప్పకుండా పాటించాలన్నారు. ఎలక్షన్ కమిషన్ జారీ చేసిన గుర్తింపు కార్డులను కలిగి ఉన్నవారికే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉన్న నేపథ్యంలో నలుగురు గానీ, అంతకంటే ఎక్కువగా కానీ గుంపులు గుంపులుగా తిరగవద్దని సూచించారు. పార్టీ జెండాలు, కండువాలు, గుర్తులు, ఫ్లకార్డులు ధరించవద్దన్నారు. మైకులు, లౌడ్ స్పీ కర్లు, ధర్నాలు, రాస్తారోకోలు, ఊరేగింపులకు అనుమతి లేదన్నారు. ఎన్నికల కౌంటి ంగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. ఆయన వెంట డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, స్పెషల్ బ్రాం చి సీఐ అనిల్‌కుమార్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, పృథ్వీధర్ గౌడ్, పోలీ సు సిబ్బంది ఉన్నారు.



తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

# కౌంటింగ్ పకడ్బందీగా నిర్వహించాలి

- పెద్దపల్లి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్
- పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుతో ప్రక్రియ ప్రారంభం
- కౌంటింగ్ నిర్వహణపై అధికారులకు శిక్షణ



మాట్లాడుతున్న పెద్దపల్లి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్

రామగిరి, డిసెంబర్ 2: అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించే విధంగా సన్నద్ధం కావాలని పెద్దపల్లి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ అన్నారు. శనివారం రామగిరిలోని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ నిర్వహణపై సంబంధిత అధికారులకు శిక్షణ ఇచ్చారు. శిక్షణ కార్యక్రమంలో ముజామ్మిల్ ఖాన్ కౌంటింగ్ పరిశీలకులు రామగుండం రాజేష్ సింగ్ రానా, మంథని సీపీ పటేల్, పెద్దపల్లి సీ.ఎన్ శ్రీధరతో కలిసి పాల్గొన్నారు. డిసెంబర్ 3న ఉదయం 8 గంటలకు జేఎన్టీయూ కళాశాలలోని ఆకాడమిక్ బ్లాక్–2లో జిల్లాలోని పెద్దపల్లి, మంథని, రామగుండం అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని ముందస్తుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఉంటుందన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం కౌంటింగ్ హాల్లో 14 కౌంటింగ్ టేబుల్, ఒక పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు టేబుల్ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి టేబుల్ వద్ద కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్ మైక్రో అబ్జర్వర్ ఒక బృందంగా విధులు నిర్వహిస్తారన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3 రిజర్వ్ బృందాలు, 3 పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు బృందాలు అందుబాటులో ఉంటాయన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియ సమయంలో ఫారం 13ఏ ఎట్టి పరిస్థితుల్లో బయటికి రావద్దన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియ నిబంధనల ప్రకారం చివరి రౌండ్ లెక్కింపు ప్రారంభానికి ముందు పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి కౌంటింగ్‌హాల్‌కు ముందస్తుగా కంట్రోల్ యూనిట్లను హమాలీలు తీసుకుని వస్తారని, ప్రతి 2 టేబుళ్లకు ఒక హమాలీ ఉంటారని, వారికి డ్రెస్ కోడ్ ఉంటుందన్నారు. ప్రతి టేబుల్ వద్ద వారికి కేటాయించిన కంట్రోల్ యూనిట్లు మాత్రమే చెక్ చేసి కౌంటింగ్ చేయాలన్నారు. కంట్రోల్ యూనిట్ లెక్కింపు ప్రారంభానికి ముందు కంట్రోల్ యూనిట్‌లో నమోదైన మొత్తం ఓట్లు ఫారం 17సితో నమోదైన ఓట్లు సరి చూసుకోవాలని తేడా వస్తే వెంటనే సదరు కంట్రోల్ యూనిట్ ను రిటర్నింగ్ అధికారికి అప్పగించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కంట్రోల్ యూనిట్‌లో క్లాక్ ఎర్రర్ వస్తే కొత్త బ్యాటరీ వేసి ఆన్ చేయాలని, అప్పటికి క్లాక్ ఎర్రర్ వస్తే రిటర్నింగ్ అధికారికి అప్పగించాలని కంట్రోల్ యూనిట్‌లో ఎటువంటి ఇబ్బందులు వచ్చినా వెంటనే రిటర్నింగ్ అధికారికి సమాచారం అందించాలన్నారు. కంట్రోల్ యూనిట్‌లో నమోదైన మొత్తం ఓట్లు ఫారం 17సీలో నమోదైన ఓట్లను ట్యాలీ చేసుకొని రిజల్ట్ బటన్ ప్రెస్ చేయాలని, కౌంటింగ్ ఏజెంట్లకు ఫలితాలు చూపించి వాటిని నిర్దేశించిన నమూనాలో నమోదు చేయాలని, 14 టేబుల్ వద్ద కౌంటింగ్ పూర్తయిన తర్వాత, ఆ రౌండ్ వివరాలు రిటర్నింగ్ అధికారి వెల్లడించిన తర్వాత మాత్రమే తదుపరి రౌండ్ కౌంటింగ్ ప్రారంభించాలని కలెక్టర్ తెలిపారు. కంట్రోల్ యూనిట్ల ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత వీవీ ప్యాట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని , వీవీ ప్యాట్ల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిబంధనల ప్రకారం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. కౌంటింగ్ నిర్వహించే సమయంలో అధికారులు, సిబ్బంది నిబంధనలను గుర్తించుకోవాలని, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించాలని కౌంటింగ్ హాల్‌లో అధికారులు, సిబ్బంది ప్రశాంతంగా వ్యవహరించాలన్నారు. ఎటువంటి సందర్భం ఎదురైనప్పటికీ లెక్కింపు ప్రక్రియ పకడ్బందీగా నమోదయ్యేలా చూసుకోవాలని, గందరగోళానికి గురి కావద్దన్నారు. వీవీ ప్యాట్ స్లిప్పుల లెక్కింపు అప్రమత్తంగా చేయాలని, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆ స్లిప్పులను బ్లాక్ కవర్‌లలో భద్రపర్చి సీల్ చేయాలని, ఈ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని ప్రక్రియ మొత్తం వీడియోగ్రఫీ చేయాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రంలోకి ఎవరికీ సెల్ ఫోన్ అనుమతి లేదని కౌంటింగ్ కేంద్రం వద్ద అవసరమైన తనిఖీ నిర్వహించి పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు.

# ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి

- కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి

కలెక్టరేట్, డిసెంబర్ 2: గతనెల 30న పోలైన అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు, కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి తెలిపారు. ఓట్ల లెక్కింపు పరిశీలకులు సీఆర్ ప్రసన్న, ఎస్‌జే చౌడ, మనీష్‌కుమార్ లోహన్ సమక్షంలో పూర్తి చేసినట్లు ఆమె వెల్లడించారు. శనివారం ఉదయం కలెక్టరేట్ కార్యాలయ సమావేశమందిరంలో నిర్వహించిన ఈ ప్రక్రియను పురస్కరించుకుని ఆమె మాట్లాడారు. ఎస్ఆర్ఆర్ కళాశాలలో 390 పోలింగ్ కేంద్రాల ద్వారా 27 మంది అభ్యర్థులకు పోలైన ఓట్లను లెక్కించేందుకు 22మంది లెక్కింపు సూపర్‌వైజర్లు, 28మంది లెక్కింపు అసిస్టెంట్లు, 22 మంది మైక్రో అబ్జర్వర్లతో పాటు మరో 16 మందిని రిజర్వుగా నియమించినట్లు వెల్లడించారు. హుజూరాబాద్‌లో 305 పోలింగ్ కేంద్రాల ద్వారా 22 మంది అభ్యర్థుల ఓట్లను లెక్కించేందుకు 17మంది లెక్కింపు సూపర్‌వైజర్లు, 20 మంది లెక్కింపు అసిస్టెంట్లు, 17 మంది మైక్రో అబ్జర్వర్లు, 15మందిని రిజర్వ్‌లో ఉంచగా మొత్తం 69 మంది, చొప్పదండిలోని 327 పోలింగ్ కేంద్రాల్లో పోలైన ఓట్లను లెక్కించేందుకు 16 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 18 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 16 మంది మైక్రో అబ్జర్వర్లను, మరో 14 మందిని రిజర్వుగా తీసుకోగా 64 మంది లెక్కింపు ప్రక్రియలో పాల్గొననున్నట్లు తెలిపారు. నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో 305 మంది నియమించినట్లు స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉదయం 8గంటల నుంచి ప్రారంభమవుతుందని, మొదటగా పోస్టల్ బ్యాలెట్లు లెక్కిస్తారని, 8.30 నుంచి ఈవీఎంలలో పోలైన ఓట్లు లెక్కించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్‌వోలు, ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, కె.మహేశ్వర్, రాజు, సీపీవో కొమురయ్య, డీఐవో శివరామ్, డీటీవో నాగరాజు, పరిశ్రమల శాఖ జీఎం నవీన్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్

పెద్దపల్లి కమాన్, డిసెంబర్ 2 : యైటింక్లైయిన్ కాలనీలోని ఏపీజే అబ్దుల్ కలామ్ స్టేడియంలో శనివారం తెలంగాణ డాడ్జ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి 2వ జూనియర్, సబ్ జూనియర్ పోటీల్లో సబ్ జూనియర్ విభాగంలో పెద్దపల్లి గాయత్రి విద్యానికేతన్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటినట్లు విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ తెలిపారు. జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో 8వ తరగతి విద్యార్థులు డి. ఇమ్రాన్, బండి సాత్విక్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. అలాగే పలువురు విద్యార్థులు ప్రశంసా పత్రాలు పొందినట్లు తెలిపా రు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను, ఎంపికకు కృషి చేసిన పీఈటీ నవీన్‌ను చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, కరస్పాండెంట్ రజని, ప్రిన్సిపాల్ విజయ్ అభినందించారు.